క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



దాచేపల్లి: మండలంలోని గామాలపాడులో శుక్రవారం రాత్రి వైఎస్సార్ సీపీ నేత బై ఏడు కొండలు ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజను వైభవంగా నిర్వహించారు. స్వామికి 18 రకాల అభిషేకాలు చేశారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి పాల్గొని స్వామికి పూజలు నిర్వహించారు. మాలధారులకు సద్ది ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పిడుగురాళ్ల జెడ్పీటీసీ సభ్యుడు జంగా వెంకట కోటయ్య, సర్పంచ్ జంగా సురేష్, ఎంపీటీసీ సభ్యుడు షేక్ ఆదాం సాహెబ్ పాల్గొన్నారు.

ఖోఖో జిల్లా జట్టుకు ఒప్పిచర్ల విద్యార్థినుల ఎంపిక



నాగ శ్రీలక్ష్మి



శివమణి

కారెంపూడి: ఉమ్మడి గుంటూరు జిల్లా సబ్ జూనియర్ ఖోఖో బాలికల జట్టుకు మండలంలోని ఒప్పిచర్ల జెడ్పీ హైస్కూలు విద్యార్థినులు ఎంపికయ్యారని ఆ పాఠశాల హెచ్ఎం విజయ లలిత శనివారం తెలిపారు. పల్నాడు జిల్లా కేంద్రం నర్సరావుపేటలో ఈ నెల 26 నుంచి 28 వరకు నిర్వహించనున్న అంతర జిల్లాల ఖోఖో పోటీల్లో విద్యార్థినులు నాగ శ్రీలక్ష్మి, శివమణి బాలికల జట్టులో ఆడనున్నారని హెచ్ఎం పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరంలో పలువురికి పరీక్షలు



పిడుగురాళ్ల: పట్టణంలోని ఐఎంఏ హాలులో చల్లగుండ్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గత నెల 15న శంకర్ కంటి హాస్పిటల్, చల్లగుండ్ల చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించిన వైద్య శిబిరంలో పాల్గొని చికిత్స చేయించుకున్న వారికి ఉచితంగా కళ్ల జోళ్ల పంపిణీతో పాటు ఉచిత వైద్య సలహాల్ని అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ చల్లగుండ్ల శ్రీనివాసరావు, యోగ్యత, శంకర్ కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీ విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు



పిడుగురాళ్ల: పట్టణంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో శనివారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు నిర్వహించారు. అనంతరం చలి కోట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేజీబీ ప్రిన్సిపాల్ బ్లెస్సీ దైవ సృజన, హెల్ప్ ఫౌండేషన్ అధ్యక్షుడు కుంచర్ల బుల్లిబాబు, దంత వైద్యుడు శివరామకృష్ణ, నవీన్ హాస్పిటల్ సిబ్బంది, ఉపాధ్యాయులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు వితరణ



బాధితులకు అండగా నిలిచిన బీద ఛేంజ్ స్వచ్ఛంద సేవా సంస్థ

బొల్లాపల్లి: అగ్నిప్రమాదం సంభవించి సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన బాధిత కుటుంబానికి బీద చేంజ్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు శనివారం అండగా నిలిచారు. మండలంలోని గుట్లపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకొని పూరిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు బీ ద ఛేంజ్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు వంట సామగ్రి, బట్టలు, కూరగాయలు, నిత్యావసర సరుకులు వితరణగా అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వై. ఆదాం, సేవా సంస్థ నిర్వాహకులు, పి. సురేష్, చిన్నకొండ, మల్లికార్జునరెడ్డి, వెంకట్రావు, హేమంత్, బ్రహ్మారెడ్డి, రవి పాల్గొన్నారు.

ఆపన్నులను ఆదుకుంటున్న సీఎం సహాయనిధి

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



చెక్కులు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల: రాష్ట్రంలో ఎక్కడ పర్యటన చేసినా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆయా ప్రాంతాల్లో అనారోగ్యానికి గురైన వారు సాయం అడిగితే వెంటనే స్పందించి లక్షల రూపాయల్ని అందజేస్తున్నారు. అందులో భాగంగా ఈ నెల 15న పల్నాడు జిల్లాలోని మాచర్ల నియోజకవర్గంలో పర్యటించిన సందర్భంగా అనారోగ్యానికి గురైన బాధితుల మొరను తెలుసుకున్న వెంటనే స్పందించారు. బాధితులకు తక్షణ సాయం చేయాలని జిల్లా కలెక్టర్ శివశంకర్, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి చెప్పారు. అందులో భాగంగా మాచర్ల 25వ వార్డుకు చెందిన కె. శ్రీనివాసరావు కుమార్తె లక్ష్మీ శరణి, 8వ వార్డుకు చెందిన ఆంజనేయులు కుమారుడు సాయితేజలకు మాచర్ల క్యాంపు కార్యాలయంలో శనివారం చెరో లక్ష రూపాయల చెక్కులను ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ పర్యటన చేసినా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్న బాధిత కుటుంబాలపై ప్రత్యేక ఆదరణ చూపుతున్నారని తెలిపారు.

అక్కడిక్కడే బాధితుల సమస్యలను తెలుసుకుని తక్షణ సాయంగా లక్షల రూపాలయల ప్రయోజనం చేకూరుస్తున్నారని చెప్పారు. ఇంతకు ముందెప్పుడూ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి అక్కడికక్కడే బాధిత కుటుంబాలకు 24 గంటల్లో ఆర్థిక సాయాన్ని అందజేసిన దాఖలాలు లేవని ప్రభుత్వ విప్ పీఆర్కే పేర్కొన్నారు. మానవతా దృక్పథం కలిగిన సీఎం లభించడం ఈ రాష్ట్ర ప్రజల అదృష్టమని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మాచర్ల మండల పరిషత్ అధ్యక్షురాలు మంగమ్మ తనయుడు బూడిద శ్రీనివాసరావు, కారెంపూడి వైస్ ఎంపీపీ బొమ్మిన అల్లయ్య సావిత్రి, రాష్ట్ర యువజన విభాగ కార్యవర్గ సభ్యులు మోర్తల ఉమామహేశ్వరరెడ్డి, పట్టణ, మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మహిళకు సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ



అన్నపూర్ణమ్మకు చెక్కును అందజేస్తున్న కౌన్సిలర్ ఉన్నం ఆంజనేయులు

పిడుగురాళ్ల: పట్టణంలోని 15వ సచివాలయ పరిధిలో 30వ వార్డుకు చెందిన వడ్డవల్లి అన్నపూర్ణమ్మ ఇటీవలే మోకాళ్ల ఆపరేషన్ చేయించుకున్నారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆమెకు రూ. లక్ష చెక్కు మంజూరైంది. వార్డు సచివాలయంలో శనివారం కౌన్సిలర్ ఉన్నం ఆంజనేయులు చెక్కును అన్నపూర్ణమ్మకు అందించారు. కార్యక్రమంలో సచివాలయ సెక్రటరీ శివ శ్రీనివాస్, లక్ష్మణ్, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

టీడీపీలో భగ్గుమన్న విభేదాలు

- గొడవ పడిన సీనియర్లు, జూనియర్లు
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయకుండా రాజీ



జానపాడు సమీపంలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్ వద్ద గొడవకు దిగిన తెలుగు తమ్ముళ్లు

పిడుగురాళ్ల: తెలుగుదేశం పార్టీ నాయకుల్లో వర్గ పోరు ఒక్కసారిగా బయటపడింది. మండలంలోని జానపాడులో శనివారం టీడీపీ, జనసేన నాయకులు కలిసి 'గుంతల ఆంధ్రప్రదేశ్' కార్యక్రమానికి హాజరయ్యారు. నూతనంగా టీడీపీలో చేరిన కొంత మంది యువకులు ఫొటోలు దిగేందుకు ఉత్సాహంగా రావడంతో సీనియర్ నేతలు సీరియస్ అయ్యారు. '' మీరు ఎందుకు ముందు ఉంటున్నారు.. వెనక్కి రండి'' అంటూ వెనక్కి లాగడంతో గొడవ మొదలైంది. చినికి చినికి గాలివానలాగా మారి కొట్టుకునే దాకా వచ్చింది. అక్కడే ఉన్న జనసేన నాయకులు ప్రేక్షకుల్లా చూస్తూ ఉండటం పలువురికి ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ క్రమంలోనే మైనార్టీ నాయకులు పిడుగురాళ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు రావడంతో విషయం తెలుసుకున్న టీడీపీ పెద్దలు అడ్డుపడ్డారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వకుండానే ఆ మైనార్టీ నాయకుడిని వెనక్కి పిలిపించుకున్నారు. మొత్తం మీద సీనియర్లు, జూనియర్ల మధ్య వర్గపోరు భగ్గుమనటంతో టీడీపీలో ముసలం మొదలైందని పలువురు అంటున్నారు. అధికారం లేకపోతేనే ఒకరికి ఒకరు పడటం లేదని, ఇక అధికారం వస్తే ప్రజలపై కూడా గొడవలకు దిగే అవకాశం ఉందని పలువురు చర్చించుకోవడం విశేషం.

23న స్పటిక శివలింగం ప్రతిష్ట మహోత్సవం



దేవస్థానంలో ప్రతిష్ఠించనున్న స్పటిక శివలింగం

సత్రశాల (రెంటచింతల): కార్తిక మాసం ఏకాదశి సందర్భంగా స్థానిక శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం ఆవరణలోని అభిషేక మండపంలో ఈ నెల 23న ఉదయం 10.58 గంటలకు పవిత్ర స్పటిక శివలింగాన్ని ప్రతిష్ఠించనున్నట్లు సత్రశాల ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి తెలిపారు. సత్రశాల దేవస్థానంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నటరాజస్వామికి ప్రతి రూపమైన ఈ స్పటిక శివ లింగాన్ని రాజస్థాన్‌లోని జైపూర్‌లో రూ.2.80 లక్షల వ్యయంతో తయారు చేయించినట్లు తెలిపారు. ప్రముఖ వేదపండితుల నేతృత్వంలో ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు, మాచర ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా స్పటిక శివలింగం ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. స్పటిక శివలింగాన్ని పూజించడం వల్ల ప్రతికూల ప్రభావాల నుంచి మనస్సు ప్రశాంతంగా ఉంటుందని, సంపద, ఆనందాన్ని ఇస్తుందని, దురదృష్టాలను తొలిగించి జీవితంలో అదృష్టాన్ని తెస్తుందని వివరించారు. ప్రసిద్ధి చెందిన కాశీ రామేశ్వరం, శ్రీకాళహస్తి వంటి ప్రముఖ దేవస్థానాలలో మాత్రమే ఇటువంటి శక్తిగల స్పటిక శివ లింగాలు ప్రతిష్ఠించారని వెల్లడించారు. ఈ స్పటిక శివలింగాన్ని భక్తులు స్మర్శించవచ్చని తెలిపారు. ప్రతిష్ఠ మహోత్సవంలో వైఎస్సార్ సీపీ పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి, పార్టీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని ట్రస్ట్ బోర్డు చైర్మన్ బ్రహ్మారెడ్డి తెలిపారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు

ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి

గురజాల: విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని రెవెన్యూ డివిజన్ అధికారి రమాకాంత్‌రెడ్డి చెప్పారు. స్థానిక శ్రీనివాస ఫంక్షన్ హాలులో శనివారం బీఎల్‌వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగ ఓట్లకు అవకాశం లేకుండా క్షుణ్ణంగా విచారించి, ఎటువంటి అవకతవకలు లేని ఓటర్ లిస్టును తయారు చేయాలని ఆదేశించారు. ఫారం- 6, ఫారం- 8 దరఖాస్తుల్ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇబ్బందులుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన తెలిపారు. అనంతరం బీఎల్‌వోల పరిధిలో గల దరఖాస్తుల్ని పరిశీలించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో స్థానిక తహసీల్దార్ మీసాల దానియేలు, డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, పాల్గొన్నారు.

సత్రశాలలో మార్మోగిన శివ నామస్మరణ



రెంటచింతల: కైలాసనాథుడు శివయ్యకు ఎంతో ప్రీతికరమైన కార్తిక మాసం సందర్భంగా శనివారం వేలాది మంది భక్తుల శివ నామ స్మరణతో స్థానిక శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానం ప్రాగణమంతా మార్మోగింది. దేవస్థానం సమీపంలోని పవిత్ర కృష్ణానది ఒడ్డున వేకువజాము నుంచే భక్తులు కార్తిక దీపాలు వెలిగించారు. అనంతరం పుణ్య స్నానాలు చేసి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాలలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, దేవస్థానం ప్రధాన అర్చకులు శివశర్మ నేతృత్వంలో స్వామి కి భక్తిశ్రద్ధలతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. హోమాల్లో పాల్గొన్నారు. భక్తులకు, స్వామి మాలధారులకు అరవ విజయకుమార్, లావణ్య దంపతులు అన్నదానం చేశారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బద్దూరి బ్రహ్మరెడ్డి, అర్చకులు శివశర్మ, సీతారామిరెడ్డి వారిని ఘనంగా సన్మానించారు.

కుల గణనకు సహకరించాలి

నరసరావుపేట: రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన కులగణన ద్వారా బీసీలకు రాజ్యాధికారం పొందే అవకాశం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కల్పించారని ఏపీ రాష్ట్ర బొందిలి సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి బొందిలి శ్రీనివాససింగ్ శనివారం పేర్కొన్నారు. సుమారు 92 ఏళ్ల అనంతరం కులగణన చేపట్టడం జరిగిందన్నారు. ఈ గణన ద్వారా ఏ కులం వారు ఎంత మంది ఉన్నారనే విషయం స్పష్టమౌతుందన్నారు. ఇప్పటి వరకు అసెంబ్లీలో అడుగు పెట్టని కులాలకి ఎమ్మెల్యేగా ప్రవేశించే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు.

'ఆడుదాం ఆంధ్రా' క్రీడల్ని విజయవంతం చేయాలి

కారెంపూడి: 'ఆడుదాం ఆంధ్రా'లో భాగంగా గ్రామ, మండల స్థాయి క్రీడల్ని విజయవంతం చేయాలని మండల క్రీడా కో-ఆర్డినేటర్ బి. స్వర్ణరాజు కోరారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం గ్రామ సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, వ్యాయామ ఉపాధ్యాయులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా స్వర్ణరాజు మాట్లాడుతూ కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలు మొదట గ్రామస్థాయిలో జరుగుతాయన్నారు. ఇక్కడ ప్రతిభ చూపిన వారు మండల స్థాయిలో, అక్కడ ప్రతిభ చూపిన వారు నియోజకవర్గ స్థాయిలో ఆడతారని వివరించారు. విజేతలకు బహుమతులు కూడా ప్రదానం చేస్తారని చెప్పారు. 15 ఏళ్లు నిండిన వారంతా క్రీడల్లో పాల్గొనవచ్చని సూచించారు. డిసెంబర్ 15 నుంచి 20 వరకు గ్రామస్థాయిలో, డిసెంబర్ 21 నుంచి జనవరి 4 వరకు మండల స్థాయిలో, నియోజకవర్గ పరిధిలో జనవరి 5 నుంచి 10వ తేదీ వరకు జరుగుతాయన్నారు. తర్వాత జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీల నిర్వహిస్తారని పేర్కొన్నారు. కబడ్డీ జట్టులో 12 మంది, ఖోఖోలో 16 మంది, క్రికెట్‌లో16 మంది, వాలీబాల్‌లో 12 మంది, బ్యాడ్మింటన్ జట్టులో ఇద్దరు ఉండేలా మార్గదర్శకాలున్నాయని స్వర్ణ రాజు వివరించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ పి. సత్యప్రసాద్, ఎంఈఓ-1 కె. కాంతారావు, పీడీ సీహెచ్. రత్తయ్య పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో సమయం ఆదా

జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మురళీ గంగాధరరావు



సమావేశంలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మురళీ గంగాధరరావు

పిడుగురాళ్ల: లోక్ అదాలత్‌తో సమయం ఆదా అవుతుందని, క్షక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మురళీ గంగాధరరావు తెలిపారు. డిసెంబర్ 9న నిర్వహించనున్న లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన క్రిమినల్, సివిల్ కేసుల్ని పరిష్కరించుకోవాలని సూచించారు. పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టులో శనివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కక్షిదారులంతా కేసుల్ని పరిష్కరించుకునే విధంగా అధికారులు కూడా వారికి అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పోటీ ప్రపంచంలో క్రమశిక్షణతోనే లక్ష్య సాధన



దుర్గి గ్రంథాలయంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



పిడుగురాళ్లలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

దుర్గి: విద్యార్థులు జీవితంలోనే లక్ష్యాన్ని ఏర్పరచుకొని క్రమశిక్షణతో దాన్ని సాధించాలని రిటైర్డ్ ఎంఈఓ శెట్టిపల్లి గోపాల్ తెలిపారు. దుర్గి గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు శనివారం సీనియర్, జూనియర్ విభాగాల్లో క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ శాఖ అధికారి పులిబండ్ల వేణు గోపి పర్యవేక్షణలో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రిటైర్డ్ ఎంఈఓ గోపాల్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థి నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలని సూచించారు. గ్రంథాలయాల్ని వినియోగించుకుని విజ్ఞానాన్ని పెంచుకోవాలని తెలిపారు. కేవలం మార్కులు, ర్యాంకులే కాకుండా సమాజంలో మార్పులు గమనిస్తూ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకోవాలని సూచించారు. క్విజ్ పోటీల్లో జూనియర్ విభాగంలో ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు మొదటి స్థానంలో, శ్రీహర్ష, సెక్రెడ్ హార్ట్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. సీనియర్ విభాగంలో ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రథమ, సెక్రెడ్ హార్ట్ స్కూలు, దుర్గి జెడ్పీహెచ్ఎస్ స్కూల్ విద్యార్థులు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. న్యాయ నిర్ణేతలుగా ఉపాధ్యాయులు అబ్బాస్, ఎర్రకొండలు వ్యవహరించారు. కార్యక్రమంలో మాచర్ల మెరిసి, మోబు పాల్గొన్నారు.

పిడుగురాళ్లలో...

పట్టణంలోని 19వ వార్డులోని ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు శనివారం 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా క్విజ్, వ్యాస రచన, రన్నింగ్, డ్రాయింగ్, క్రీడా పోటీల్ని నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎ. ఆల్‌ఫ్రెండ్, ఉపాధ్యాయులు పోతురాజు, సాంబశివరావు, రమేష్‌బాబు, పుల్లారావు, గ్రంథాలయ అధికారి కె. రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

మహాసభలు జయప్రదం చేయండి

శావల్యాపురం: గురజాలలో ఈనెల 26న జరగనున్న యూటీఎఫ్ పల్నాడు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక మండల వనరుల కేంద్రం ప్రాంగణంలో గోడ పత్రికలు అవిష్కరించినట్లు మండల యూటీఎఫ్ అధ్యక్షులు గూడ్లూరి ప్రసాద్ శనివారం తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పి.సురేష్, డి.రవికుమార్, ఏ.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో ఆర్యవైశ్యులు భాగస్వామ్యం కావాలి

ఆర్యవైశ్య ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: సమాజాభివృద్ధిలో ఆర్యవైశ్యులు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పిలుపు ఇచ్చారు. పట్టణంలోని సత్తెనపల్లి బస్టాండ్ సెంటర్‌లోని వాసవీ కళ్యాణ మండపంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కుల, మతాలకు అతీతంగా అన్నీ తరగతులకు లబ్ధి చేకూరేలా సుపరిపాలన సాగిస్తోందన్నారు. ఆర్యవైశ్యులు రాజకీయంగా రాణించాలనేది ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అభిమతమని, అందుకు అనుగుణంగానే వారిని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లేందుకు కార్యక్రమాలను చేపట్టారని వెల్లడించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్య వైశ్యులకు ప్రత్యేక గుర్తింపు దక్కిందని గుర్తుచేశారు. గతంలో వెల్లంపల్లి శ్రీనివాసరావుకు మంత్రి పదవి, ప్రస్తుతం కోలగట్ల వీరభద్ర స్వామికి డిప్యూటీ స్పీకర్‌గా ఆర్యవైశ్య సామాజిక వర్గానికి ఇచ్చి గౌరవించారన్నారు. తమ ప్రభుత్వంలో ఆర్యవైశ్యులు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా స్వేచ్ఛగా వ్యాపారం చేసుకోగలుగుతున్నారన్నారు. నాగార్జునా యూనివర్సిటీ సెనేట్ మెంబర్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరావు, పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, ఏపీ డ్రగ్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కేపీ రంగారావు, రైస్‌మిల్లర్ల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వురా భాస్కర్ రావు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మాజేటి సాంబశివరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్ష, కార్యదర్శులు కొత్తూరి కిషోర్, గాదంశెట్టి రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగ రాష్ట్ర కార్యదర్శి దివ్వెల రామకృష్ణ, మాట్లాడగా, పెద్ద ఎత్తున ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

బొల్లాపల్లి : ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని గుమ్మనంపాడు జడ్పీహై స్కూల్‌లో బాల్య వివాహ నిరోధక చట్టంపై అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం కె. రమాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇ. శ్రీదేవిలు బాల్య వివాహ నిరోధక చట్టం 2005 ప్రకారం 18 ఏళ్లు నిండేవరకు వివాహం చేయరాదని తెలిపారు. బాల్య వివాహాలు నిర్వహిస్తే చట్టరీత్య నేరమని తెలిపారు. బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ప్రధానంగా తల్లిదండ్రులు బాల్య వివాహాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆడపిల్లలను రక్షిద్దాం, చదివిద్దాం అనే నినాదంతో విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

70వ అఖిల భారత సహకార వారోత్సవాలు



ప్రతిజ్ఞ చేస్తున్న సొసైటీ చైర్మన్ పొట్లపల్లి పిచ్చిరెడ్డి, సభ్యులు

వినుకొండ(నూజెండ్ల): భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా మండల కేంద్రమైన నూజెండ్లలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో 70వ అఖిల భారత సహకార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సొసైటీ చైర్మన్ పొట్లపల్లి పిచ్చిరెడ్డి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార ఉద్యమంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యులు కావాలని కోరారు. సహకార సంఘాల్లో రైతులకు సబ్సిడీపై ఎరువులు, తక్కువ వడ్డీకే రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాలను ప్రతిఒక్కరూ సద్వినియోగించుకోవాలన్నారు. అనంతరం సీఈవో గంగినేని శ్రీనివాసరావు సహకార సభ్యులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ములకలూరు సర్పంచ్ కంచర్ల బాబు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు జడ్డా రామయ్య, అమర ఏడుకొండలు, వంగూరి హనుమయ్య, గాదె నాగార్జునరెడ్డి, చిట్టి గురువారెడ్డి, కుందూరి హనుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంపై అవగాహన

సత్తెనపల్లి: బాలికలు చదువుకొని అన్ని రంగాల్లో రాణించాలని సీడీపీఓ టి.శ్రీలత అన్నారు. బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా సత్తెనపల్లి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో శనివారం నియోజకవర్గస్థాయిలో నిర్వహించిన బాలికల హక్కులపై అవగాహన సదస్సులో ఆమె పాల్గొని, మాట్లాడారు. సీడీపీఓ శ్రీలత మాట్లాడుతూ ప్రతి బాలిక చదువుకోవాలని, చదువుకుంటే సమాజంపై అవగాహన ఉంటుందన్నారు. బాల్యంలో వివాహాలు చేసుకోవడం వల్ల అనేక అనర్థాలు దాపురిస్తాయని, అవి చట్టరీత్యా నేరమన్నారు. ఈ సందర్భంగా గుడ్డు టచ్ బ్యాడ్ టచ్, బేటి బచావో బేటి పడావో తదితర వాటిపై అవగాహన కల్పించారు. సదస్సులో మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, డీసీపీఓ విజయ్ కుమార్, ఎస్ఐ సంధ్యారాణి మాట్లాడారు. సదస్సుకు ఏసీడీపీఓ సంతోషకుమారి అధ్యక్షత వహించారు. విద్యార్థినులతో బాల్య వివాహాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు పాల్గొన్నారు.